# దావాగ్ని

రచన:
శ్రీ చింతూరి మల్లిబాబు

అప్పటికి రెండుగంటలకు పైగా ఆశాలత అశోకవృక్షం క్రింద నిలబడి నిరీక్షిస్తోంది. అల్లంతదూరంలో అందమైన బిల్డింగ్—దాని ప్రధానభాగంలో ప్రముఖంగా కనిపించే 'పంచశీల మూవీస్' అనే చక్కని డిజైన్సు లెటర్సుగల సైన్‌బోర్డు. అటూ ఇటూ తిరిగి ఆమె దృష్టి చివరికక్కడే నిల్చిపోయింది.

మధ్యాహ్నం మూడుగంటలప్రాంతం. మిరుమిట్లు గొలుపుతూ మిడిసిపడుతున్న ఎండకాంతిలో ఆ ఆవరణమంతా అద్భుతంగా ఉంది తీర్చి దిద్దినబాటలు, బాటల ప్రక్కన వెల్లవేసి వరసగా పాతబడ్డ ఇటుకలు, వాటికిరువైపులా విస్తరించిన అందమైన తివాచీల్లాంటి పచ్చని పచ్చిక మధ్య మధ్యన రకరకాల పూలమొక్కలు, తీగలు, క్రోటన్సు. చుట్టూరా సుందరంగా కత్తిరించబడ్డ ఎడ్జెస్—ఎంతైనా మనోహరంగా ఉన్నాయ్. పోర్టికోలోకొచ్చి ఆగేవి, తిరిగి వెళ్ళేవి ఖరీదైన కార్లు—అందులో దర్జావంతులు—స్త్రీలు, పురుషులు. వాళ్ళకి ఏ ఆటంకమూ లేదు—ఠీవిగా, స్టయిలుగా లోపలి కెళ్తున్నారు. మాట్లాడేసి వస్తున్నారు. నవ్వులు—పరాచికాలు—వాతావరణం. ఉల్లాసకరంగా, కలర్‌వుల్‌గా వుంది.

ఆశాలత ఓపికగా, ఆశగా కన్నార్పకుండా, అటువేసే చూస్తూండిపోయింది. విసుగు, చిరాకు, కోపం. బాధ ఆమెను వికావికలు చేస్తున్నాయ్. దైన్యం, నిరాశ, ఆమె ముఖంలో ప్రతి ఫలిస్తున్నాయ్! వేడిగాలికి ఆమె పెదాలు ఎండిపోతున్నాయ్. శరీరం చెమటపట్టి జిడ్డు-జిడ్డుగా చికాకుగా ఉంది. ముఖానికి పెట్టుకొన్న కోటా కరిగిపోతున్నట్లనిపిస్తోంది. ఫేషన్‌గా అమర్చుకొన్న హెయిర్‌స్టైల్, కొట్టవచ్చి నట్లవుపిస్తున్న ఎర్రని లిప్‌స్టిక్, శరీరం వొంపులన్నీ ప్రదర్శించే లేతరంగు జపాన్‌శారీ, ఆకర్షక కేంద్రాల్ని అద్భుతమైన కోణాల్లో ప్రస్ఫుటింపజేసే బ్రాసియర్, దాని మీద వుండీ లేనట్లున్న ఉల్లిపొర లాంటి 'వైట్ బ్లౌజ్, చేతిలో వ్యానిటీ బ్యాగ్, కాళ్ళకి హైహీల్సు, నీటుగా ముస్తాబై కుమారి ఆశాలత—తన గ్లామర్‌తో, సెక్సప్పీలుతో మాట్‌ని ఎట్రాక్టు చేసి ఉర్రూతలూగించే జూనియర్ ఆర్టిస్టు—ఇంత సేపుగా ఆ చెట్టుక్రింద నిల్చుని తపస్సు చేస్తుంటే—ఎవరూ ఆమెని పట్టించుకున్న పాపాన పోలేదు.

రబ్బరు పైపులతో లాన్సు తడుపుతున్న తోటమాలి, లోపలికీ బయటికీ తిరిగే ఆఫీసు బంట్రోతులూ, పోర్టికోలో కార్లాపి ప్రక్కకి వచ్చి సిగరెట్ కాల్చుకునే డ్రైవర్లూ—ఆశాలతని మాత్రం ఆదరంగా పరికిస్తున్నారు.

ఆమె వచ్చిన వెంటనే ప్యూన్ ద్వారా లోపలికి తన రాకని తెలియజేసింది. కాని 'కొంతసేపు వెయిట్' చెయ్యవలసిందిగా సూచన చేయబడింది. పావు గంట, అర గంట, రెండు గంటలు—ఎంతసేపు వెయిట్ చేసినా పిలుపు రావడం లేదు.

ఇలాగే చూస్తూ కూర్చుంటే డైరక్టరుగారు కాస్తా ఆఫీసు క్లోజ్ చేసి, కార్లో తుర్రున వెళ్ళిపోవచ్చు! పిలుపు రాకున్నా సరే 'డేర్' చేసి లోపలికెళ్ళి ఆయన్ని 'మీట్' అవడం మంచిది. వ్రేళ్ళతో ముంగురులు వెనక్కి తోసుకుని, కర్చీఫ్‌తో ముఖం మీది చెమట బిందువులు మెల్లిగా అద్దుకుని, చీర సరి చేసుకుని గబగబా వెళ్ళి ఆఫీసు వరండా మెట్లెక్కింది.

'అదేమిటి? వారు పిలుస్తారుండండి.' ప్యూన్ వారించబోయాడు.

'నేను వచ్చిన సంగతి అసలు వారితో చెప్పావా నీవు?' ఆశాలత తీవ్రంగా అడిగింది.

'ఎందుకు చెప్పలేదు? అప్పుడే చెప్పాను. మరికొంత సేపాగమన్నారు.'

'ఎంత సేపాగాలి?'

'ఏమిటమ్మా అంత కోపం? డైరెక్టరుగారు మంచి బిజీగున్నారు. మీ రిక్కడే నించోండి. మరొకసారి చెప్తాను—మీ రొచ్చారని.' వాడు లోపలి కెళుతున్నాడు.

ఆశాలతకి ఇంక ఆలస్యం చేయడం లాభం లేదనిపించింది. ఇదే సమయం దర్శక-నిర్మాతగారు ఒంటరిగా వుంటారు. తాత్సారం చేస్తే ఇంకెవరయినా విజిటర్స్ రావచ్చు....కనుక ఇప్పుడే వెళ్ళి వార్ని కలుసుకోవాలి.

సాహసించి లోపలికి నడిచింది ఆశాలత. మధ్యల్ ప్యూన్ ఎదురై ఏదో చెప్పబోయాడు. కానీ ఆమె వినిపించుకోకుండా, త్వర-త్వరగా స్ప్రింగ్ డోర్స్ తొలగించుకొని, డైరెక్టరుగారి రూమ్‌లో ప్రవేశించింది.

సోఫాలో కూర్చుని సిగరెట్ పొగ రింగు-రింగులుగా వదలుతూ, వాటిలోకి దృష్టి సారించి, ఏదో ఊహాలోకంలో తేలిపోతున్న డైరెక్టరు వెంటనే తల త్రిప్పి, కుమారి ఆశాలత వైపు చూశాడు.

ప్రసన్నమయిన చూపులో తీక్షత వచ్చి కళ్ళు ఎగసి పడ్డాయి.

ఆశాలత వినయంగా చేతులు జోడించి నమస్కారం చేసింది.

డైరెక్టరుగారు నొసలు చిట్లించాడు. కనుబొమలు అప్రయత్నంగా ముడి పడ్డాయి.

ఆశాలత అదేమీ గమనించనట్లుగా నిలబడిపోయింది.

పైన తిరుగుతున్న సీలింగ్ ఫాన్, టిక్-టిక్ మంటూ కొట్టుకుంటోవ్న గోడ గడియారం, టెలిఫోన్ సెట్, గాడ్రెజ్ టేబుల్ మీద గ్లోబుపై ఎగిరిపోతున్న పావురాలు గల ఎంబ్లం, బీరువాలు, ఫైల్సు, కిటికీ తెరలు, కేలండర్లు, ఫొటోలు - ఫర్నిచర్ అన్నీ అలుక్కు పోతున్నట్లు అనిపించాయి ఆశాలత కళ్ళకి! ఎందుకనో తూలి పడబోయింది. ఖాళీ కుర్చీ నానుకుని మొగ్గాపుకుంది.

డైరెక్టరు ఆమెవైపు అదోలా చూశాడు.

'ఎందుకొచ్చారు?' ఆయన పలకరించాడు.

'మీ దర్శనం కోసమే.' ఆమె జవాబు.

'యస్....మాట్లాడేదుంటే తొందరగా మాట్లాడండి. అవతల బోలెడు ఎంగేజ్‌మెంట్సున్నాయి.'

'జస్ట్! ఒక్క నిముషం....'

'ఏమిటి నిలబడే ఉంటున్నారు? కూర్చోండి!' కుర్చీ చూపించాడు.

ఆమె కూర్చుంది. పైట చెంగు సర్దుకుంది. ఎలా మొదలుపెట్టాలో అర్థం కావడం లేదు - ఆమెకి సంభాషణ. పెదాలు తడుపుకొంటూంది.

'డ్రింకు తీసుకుంటారా?'

బెల్ మ్రోగింది.

నౌకర్ పరుగెత్తుకొంటూ వచ్చాడు.

'డ్రింకు తీసుక రా.'

'అక్కర్లేదు లెండి!'

'డోంట్ వర్రీ.'

డైరెక్టరు స్టైలుగా నవ్వుతూ సిగరెట్ దమ్ము లాగి వదిలాడు.

ఆది ఆమె చుట్టూ చక్కర్లు గొట్టి ఉక్కిరి బిక్కిరి చేసింది. డ్రింక్ వచ్చింది.

ఆమె అందుకోలేదు.


ఆంధ్రప్రదేశంలో అన్ని షాపులలోను దొరుగుచున్నది

గోపాల్ పళ్ళపొడి






జుపిటర్ వారి అత్యుత్తమమైన తయారింపులు!

• జుపిటర్ ఫైన్ • వెస్టన్ • షోర్
• కూల్ టెక్స్ • విజయ్ • కాస్మో

మీరు బనియన్లు కొనే ముందు "జుపిటర్" మార్కు వున్నదా అని చూచి కొనండి.

హైదరాబాదు - సికిందరాబాదు మినహా అన్ని చోట్లలో ఏజెంట్లు కావలెను.

తయారించువారు

Grams : JUPITER Phone: 20670

**Jupiter Knitting Company**

Lakshminagar Main Road,

TIRUPUR - 638 602.


'షేకిట్....'

టీపాయ్ మీదినుంచి డ్రింక్ అందుకుంది.

'మీరు....?'

'అవసరం లేదు. ఇప్పటికే చాలా సార్లు అయింది.'

'.... .... .... .... ....'

'ఇప్పుడు చెప్పు?'

'మరేం లేదండీ! ఇప్పుడు తీస్తున్న పిక్చర్లో నాకు వేషం యిచ్చి, మళ్ళా ఎందుకు తీసేశారు?'

'ఎందుకా?' అని కొంత సేపాగి — "ఆ రోల్‌కి నువ్వు సూటు కావని....' దర్శకుడు వాక్యం పూర్తి చేయలేదు.

'అటువంటప్పుడు ముందరెందుకు నన్ను బుక్ చేసుకున్నారు?' ఆశాలత తీక్ష్ణంగా అడిగింది.

'అప్పటికి స్టోరీ గురించి సరిగా డిసైడ్ చేసుకోలేదు మేము. తరువాత కొన్ని మార్పులు చేశాము. అల్లాంటి పరిస్థితిలో ఆ కారక్టరు నీకు పడదనుకున్నాం. అందుకని నిన్ను కాన్సిల్ చేశాం.'

'మరి మనం రాసుకున్న కాంట్రాక్టు?'

'కాంట్రాక్టా? అడ్వాన్సు యిచ్చాంగా? డోంట్‌వర్రీ - ఈ సారికి ఎక్కడయినా మరోచోట ట్రై చెయ్. నీకు తప్పకుండా వేషం దొరుకుతుంది. ఈ నెలలో చాలా మంది నిర్మాతలు పిక్చర్లు మొదలెట్ట బోతున్నారు. నెక్స్ట పిక్చర్లో నీకు గ్యారంటీగా ఛాన్సు యిస్తాను. తెలిసిందా?' ఆయ నెంతో టాక్టీసుగా మాట్లాడుతున్నాడు.

ఆశాలత కడుపు దహించుక పోతూంది!

ఆమె కళ్ళు నిప్పులు చెరిగాయి.

'అయ్యా! డైరెక్టరుగారూ! ఈ డొంకతిరుగుడు కబుర్లన్నీ ఎందుకు? నా వేషం ఎందుకు కాన్సిల్ చేశారో నాకు తెలుసు! నిన్న గాక మొన్న ఫీల్డులో దిగి, ఇప్పటి దాకా ఎక్‌స్ట్రాగా తిరిగి, కొత్త లీడింగున్న ఆ హ్యూమర్ స్టారుని పట్టుకుని బుక్కింగులు రాబట్టుకుని రైజై, నేడు పేరు మార్చేసి, పెద్ద స్టారులా పోజు పెడుతున్న ఆ లంగా డాన్సు లలనామణి ఆ రోల్‌కి పనికొస్తుందా? నాకంటే మించి దానికి యాక్టింగ్ కెపాసిటీ ఏడ్చి చచ్చిందా? దానికున్న వర్తేమిటి? దానికున్న గ్లామరేమిటి? అయ్యా! దర్శక మహాశయా! ఆ మోహనలతగారు మీ కేమేమైతే చేస్తుందో నేను కూడా లోపం రాకుండా ఆ పనులన్నీ చేస్తానండీ! అనవసరంగా మా పొట్ట కొట్టకండి.' ఆశాలత పొంగి వస్తున్న ఆవేశంతో, బాధతో, ఆక్రోశంగా అంది.

డైరెక్టరు బుర్ర గిర్రున తిరిగిపోయింది. మరుక్షణంలో కొంచెం తేరుకుని ఆత్రంగా కేకేశాడు.

'డ్రింక్ — అర్జంట్!'

డ్రింక్ తీసుకున్న తర్వాత ఆశాలతను మరునటి రోజు రమ్మన్నాడు డైరెక్టరు. మరునటి రోజు ఆశాలత వెళ్ళింది. తను బుక్ చేసుకున్న కొత్త నటితో రాత్రికి రాత్రే బొంబాయి వెళ్ళిపోయాడని తెలిసి, ఆశాలత బాధ పడుతూ వెనుకకు తిరిగింది.